క్లుప్తంగా

పాఠశాలలకు నీటి సదుపాయం కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలకు తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సభ్యుడు అబుబాకర్ డిమాండ్ చేశారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌ఎఫ్‌ఐ కర్నూలు మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో కనీస వసతులు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మండల కన్వీనర్‌గా అంజి, కోకన్వీనర్‌గా జుబేర్, సభ్యులుగా లోకేష్, రాజేష్, వేణు, ఠాగూర్, చిన్న, గౌతమిలను ఎన్నుకున్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



కలెక్టరేట్‌ఎదుట నిరసన తెలుపుతున్న దళిత క్రైస్తవులు

కర్నూలు(సెంట్రల్): దళిత క్రైస్తవులుకు ఎస్సీ హోదా కల్పించాలని పాస్టర్లు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఎస్సీ హోదా కోసం క్రైస్తవ సంఘాలు ధర్నా నిర్వహించాయి. క్రైస్తవ సంఘాల జేఏసీ చైర్మన్ ఎస్.భాస్కర్ మాట్లాడుతూ దళితక్రైస్తవుల్లో అత్యంత పేదలు ఉన్నా ఎస్సీ రిజర్వేషన్ లేక పోవడంతో చదువులు, ఉద్యోగాలకు దూరం కావాల్సి వస్తోందన్నారు. ఈ విషయాన్ని పలు మార్లు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు.

'గీతాంజలి'లో ల్యాంప్ లైటింగ్



కళాశాల యాజమాన్యంతో జ్యోతి తేజస్విని

కర్నూలు(హాస్పిటల్): స్థానిక గాయత్రి ఎస్టేట్‌ని గీతాంజలి నర్సింగ్ కాలేజీలో శనివారం సాయంత్రం ల్యాంప్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, కళాశాల కరస్పాండెంట్ పెరుగు విజయవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. రాష్ట్రస్థాయిలో ఎమ్మెస్సీ నర్సింగ్ మెడికల్ సర్జికల్ విభాగంలో నాల్గవ ర్యాంక్ సాధించిన తూముకుంట జ్యోతి తేజస్వినికి నగదు బహుమతి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వసంతకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు సిటీ: తనకు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ రాజీవ్ గాంధీ లెజండరీ అవార్డును ప్రదానం చేసిందని బిక్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నాగస్వామి నాయక్ తెలిపారు. శనివారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన రాజీవ్ గాంధీ జయంతి సభలో మక్తల్ ఎమ్మెల్యే వి.శ్రీహరి, సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ఎస్ సరోజమ్మ చేతుల మీదుగా తాను అవార్డు అందుకున్నానన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

కర్నూలు కల్చరల్: సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జే అండ్ జే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. నిర్వాహకులు విజయబాబు మాట్లాడుతూ ఆర్కెస్ట్రాతో మొదటిసారి సినీ గాయకులు డాక్టర్ కె.జె. ఏసుదాసు సంగీత విభావరి నిర్వహిస్తున్నామన్నారు. వివిధ భాషల్లో ఏసుదాసు పాడిన పాటలను గాయకులు విజయబాబు, జాఫర్ బాషా, బ్లెస్సీ, జ్యోతి పాడి శ్రోతలను అలరించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, సభ్యులు జీవీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పూడికతీత పనులు వేగవంతం చేయండి

కర్నూలు (టౌన్): నగరంలోని మురుగు కాల్వల్లో చేపడుతున్న పూడికతీత పనులు వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ సూచించారు. శనివారం స్థానిక వైద్య కళాశాల వద్ద చేపడుతున్న పూడిక తీత పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడారు.

కుళాయి కనెక్షన్లపై ఇంటింటి సర్వే

ఇంటింటికి కుళాయి కనెక్షన్లకు సంబంధించిన సర్వే చేడుతున్నట్లు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ తెలిపారు. శనివారం మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులు హరికిరణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో నిర్వహించిన ఈ సమీక్షలో నగరపాలక రెవెన్యూ, ఇంజినీరింగ్, అడ్మిన్, ఎమినిటీస్, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఈనెల 12న ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందిస్తుందన్నారు.



టైలర్ షాపు..



జూస్ సెంటర్ నిర్వహిస్తున్న దృశ్యం



ఫ్యాన్సీ షాపు..



అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లోని చందనా బ్రదర్స్ కింద పార్కింగ్ ప్లేస్‌లో దుస్తుల దుకాణం నిర్వహిస్తున్న దృశ్యం

'పార్కింగ్' వ్యాపారం

జిల్లా కేంద్రంలోని వ్యాపార సముదాయాలు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకునే క్రమంలో నిబంధనలకు నీళ్లొదులుతున్నాయి. భవనం సరిపోకపోవడమో.. లేక అత్యాశో తెలియదు కానీ.. పార్కింగ్ సెల్లార్లను సైతం ఆక్రమించి వ్యాపారానికి ఉపయోగించుకుంటుండటంతో వాహనదారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరి కొందరు వ్యాపారులు తమ భవన సముదాయం ముందున్న స్థలాలను సైతం ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండటంతో వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే నిలిపేసి వెళ్లాల్సి వస్తోంది. కేఈ కాంప్లెక్స్, అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్ ప్రాంతాల్లో అయితే కనీసం వాహనం నిలిపేందుకు కూడా స్థలం ఉండటం లేదు. అధికారులు కూడా పర్యవేక్షణను గాలి కొదిలేయడంతో దుకాణాదారులు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైందనే ఆరోపణలున్నాయి.

– సాక్షి ఫొటో గ్రాఫర్,కర్నూలు



దేవనగర్‌లోని మునిసిపల్ కాంప్లెక్స్ కింద దుకాణాలు నిర్వహిస్తున్న దృశ్యం



మొబైల్ షాపు..



కేఈ కాంప్లెక్స్‌లోని పార్కింగ్ ప్రదేశాల్లో దుకాణాలు నిర్వహిస్తున్న దృశ్యం

స్క్రాప్ టెండర్ రద్దు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇటీవల పిలిచిన స్క్రాప్ టెండర్‌ను రద్దు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఇప్పటికే దరఖాస్తు తీసుకున్న వారు వాటిని మళ్లీ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు కోసం తీసుకున్న డబ్బు కొత్త దరఖాస్తుకు సర్దుబాటు చేస్తామన్నారు.

18న భాగవత గ్రంథ ఆధారిత పోటీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని జాగిర్దార్ మధ్వ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో శ్రీభాగవత గ్రంథ ఆధారిత పోటీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు సమితి వ్యవస్థాపకులు జాగిర్దార్ పార్థసారథి తెలిపారు. 16 ఏళ్లలోపు వయసు వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు ఆర్.సుధారాణి 89850 94070 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

విరాళాల సేకరణ

కర్నూలు(సెంట్రల్): కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం దాతలు ముందుకొచ్చి సాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌ఎండీ షరీఫ్, జి.రామకృష్ణ కోరారు. పాతబస్తీతో పాటు మండలంలోని బసాపురంలో శనివారం వారు కేరళ వరద బాధితుల కోసం విరాళాలను సేకరించారు. మానవత్వంతో బాధితులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ తమవంతు ఆర్థిక సాయం చేయాలన్నారు. డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నాయకులు విశ్వనాథ్, సీతారాముడు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఔషధ ధరలు మరింత ప్రియం

- 10 నుంచి 40 శాతం పెరిగిన మందుల ధరలు
- జిల్లాలో 2,516మందుల దుకాణాలు, ఏజెన్సీలు
- నెలకు రూ.250 కోట్ల దాకా విక్రయాలు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై ఆర్థిక భారం
- జనరిక్ మందుల వైపు చూపు



కర్నూలు(హాస్పిటల్): జీవనశైలి మార్పులతో సమాజంలో దాదాపుగా ప్రతి ఒక్కరూ ఏదో ఒక జబ్బుతో బాధపడుతున్నారు. ఈ జబ్బులను తగ్గించుకునేందుకు వారు తప్పనిసరి పరిస్థితుల్లో ఔషధాలను వాడాల్సిన పరిస్థితి నెలకొంది. కోవిడ్ అనంతరం ఈ పరిస్థితిలో మరింత మార్పు వచ్చింది. మందుల విక్రయాలు పెరిగాయి. ఇదే క్రమంలో ఔషధాల ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. కోవిడ్ అనంతరం ప్రారంభమైన ధరల పెరుగుదల ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. గత రెండేళ్ల నుంచి 10 నుంచి 40 శాతం వరకు వీటి ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇది పేద, మధ్యతరగతి ప్రజలపై భారం అయ్యింది.

పేదలపై భారం

ఒకవైపు నిత్యావసర ధరలు పెరుగుతూ ఉంటే తామేమీ తక్కువ కాదంటూ ఔషధ తయారీ కంపెనీలు ధరలు పెంచేస్తున్నాయి. మూడేళ్ల క్రితం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.3వేలు అయ్యే మందుల ఖర్చు ఇప్పుడు రూ.4వేలు దాటుతోంది. దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,500లకు పైగా హోల్‌సేల్, రిటైల్ మెడికల్‌షాపులు ఉన్నాయి. ఇందులో కర్నూలు జిల్లాలో 1,498 రిటైల్ హోల్‌సేల్, నంద్యాల జిల్లాలో 1,160 రిటైల్, హోల్‌సేల్ మెడికల్‌షాపులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా రూ.180కోట్ల నుంచి రూ.250కోట్ల వరకు మందుల టర్నోవర్ జరుగుతుంది. ఈ మేరకు పెరిగిన ధరల కారణంగా ప్రతి నెలా ప్రజలపై రూ.20కోట్ల నుంచి రూ.25కోట్ల వరకు భారం పడుతోంది.

రెండేళ్లలో పెరిగిన ధరల వివరాలు.. ఒక స్ట్రిప్‌కు

మందు పేరు	పాత ధర రూ.	కొత్త ధర రూ.
అల్ట్రాసెట్	219	286
ఆర్‌హెచ్‌ఇ–ఎఫ్‌డీ	100.80	133.65
హైఫెనాక్ –పి	83	108.50
నిఫ్టాస్100ఎంజి	121	127.11
సెన్సిపాడ్ సీవీ	315	352
డైనాప్రెస్ 0.4ఎంజి	384.75	511
ఇక్రిల్ ఎం1	34	42
ర్యాజో 20ఎంజి	200.75	267

జనం చూపు జనరిక్ వైపు

బ్రాండెడ్ మందుల ధరలు అమాంతం పెరుగుతుండటంతో బడ్జెట్ తగ్గించుకునేందుకు జనం ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. ఇందులో భాగంగా చౌకగా లభించే జనరిక్ మందులను వాడుతున్నారు. ముందుగా వైద్యుల వద్ద ప్రిస్కిప్షన్‌లో రాసిన మందుల్లో ఒక్కో స్ట్రిప్ కొని ఆ తర్వాత అవే మందులను జనరిక్ మందుల దుకాణంలో జనరిక్ కంపెనీలవి కొంటున్నారు. దీనివల్ల వారికి బడ్జెట్‌లో 60 నుంచి 80 శాతం తగ్గుతోంది. ఇదే సమయంలో కొన్ని కార్పొరేట్ మందుల దుకాణాలు మందులపై భారీ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. కొన్ని దుకాణాలు 20 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తూ ఉంటే మరికొన్ని కార్పొరేట్ కంపెనీలు వారి కంపెనీలో తయారైన మందులపై ఏకంగా 80 శాతం వరకు డిస్కౌంట్ ప్రకటిస్తున్నాయి. ఈ మేరకు ఓపెన్‌గా మందుల దుకాణాల వద్ద ప్రకటనలు ఇస్తుండటంతో జనం అటువైపుగా వెళ్తున్నారు. ఒకసారి వాటిని కొని వాడి ఫలితం బాగానే ఉందనుకుంటే నిరంతరాయంగా అవే కొని వాడుతున్నవారు పెరుగుతున్నారు. బ్రాండెడ్ మందులతో సమానంగా జనరిక్ మందులు, కార్పొరేట్ మెడికల్ షాపుల్లో విక్రయించే మందులు పనిచేస్తున్నాయని వారు చెబుతున్నారు. అలాంటప్పుడు ఎక్కువ ధరకు మందులు ఎందుకు కొనాలని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు చాలా మందుల దుకాణాలు ఎంఆర్‌పీపై 10 శాతం వరకు డిస్కౌంట్ ఇచ్చి విక్రయిస్తున్నాయి.

జనరిక్ మందులు పనిచేస్తాయి



బ్రాండెడ్ కంపెనీల మందుల వలే జనరిక్ మందులు కూడా నాణ్యమైనవే. వాటిలో ఎలాంటి మందు ఉంటుందో ఇందులోనూ అలాంటి మందే ఉంటుంది. రెండింటిలోనూ పనిచేసే గుణం ఒక్కగానే ఉంటుంది. కాబట్టి జనరిక్ మందుల గురించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా నిరభ్యంతరంగా వాడవచ్చు. మందుల ధరలను నియంత్రణలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం జనరిక్ మందులను, మందుల దుకాణాలను ప్రోత్సహిస్తోంది.

–రమాదేవి, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ, కర్నూలు

మందుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి



కోవిడ్ అనంతరం గత రెండేళ్లుగా బ్రాండెడ్ కంపెనీల తమ ఔషధాల ధరలను పెంచుతూనే ఉన్నాయి. రెండేళ్లుగా బ్రాండ్‌ను బట్టి 10 నుంచి 30 శాతానికి పైగా ధరలు పెరిగాయి. కొత్త స్టాక్ వచ్చినప్పుడల్లా ధరలు పెరుగుతున్నాయి. ఉన్న స్టాక్‌ను బట్టి వాటి ఎంఆర్‌పీ బట్టి మందులను విక్రయించాల్సి వస్తోంది. పోయిన నెల తీసుకున్నాం తక్కువ ఉంది ఇప్పుడు ధర ఎక్కువ చెబుతున్నారని కస్టమర్లు రిటైల్ దుకాణదారులతో గొడవ పడుతున్నారని మా దృష్టికి వస్తోంది. ఈ పరిస్థితిని చూస్తూ ఉండటం తప్ప మేమేమీ చేయలేని పరిస్థితి. ఇది పేద, మధ్యతరగతి ప్రజలపై భారంగా మారుతుంది.

– పుల్లయ్య, సెక్రటరీ, కర్నూలు డిస్ట్రిక్ట్ డ్రగ్ డీలర్స్ అసోసియేషన్

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్): కరాటే క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. శనివారం స్థానిక చిన్మయ విద్యా మిషన్ ఇటీవల విశాఖపట్నం, కేరళ రాష్ట్రాల్లో జరిగిన కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఆయన అభినందించారు. క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి కరాటే వంటి మార్షల్‌ఆర్ట్స్ క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఆత్మరక్షణకు ఉపయోగపడే మార్షల్‌ఆర్ట్స్ లాంటి క్రీడల వైపు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.

జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జె.లలితమ్మ

కర్నూలు(సెంట్రల్): సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జె.లలితమ్మ కోరారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జాతీయ సమితి సమావేశాలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లాలన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను రద్దు చేయడంతో బానిసత్వం పెరిగిపోతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.మునెప్ప, ఎం.కృష్ణయ్య, బి.రాజు, రామాంజనేయులు, ఓబీ నాగరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం అమానుషం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: విజయవాడలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరులోని ఇందిరమ్మ కట్ట వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆయన బడుగు, బలహీన వర్గాలతో కలిసి పాలాభిషేకం చేసి, కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శిలాఫలకాలను ధ్వంసం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. చివరికి రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహంపై కూడా దాడి చేశారంటే శాంతిభద్రతలు ఏ విధంగా ఉన్నాయో ప్రజలు గమనిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక, పథకాల అమలు చేయాలని ప్రజలు రోడ్లపైకి రాకుండా భయభ్రాంతులకు గురిచేసేందుకే అధికార పార్టీ నాయకులు ఇలాంటి హింసా ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కార్యాలయాలకు పార్టీ రంగులు వేస్తున్నారంటూ గగ్గోలు పెట్టి.. ఇప్పుడు అన్న క్యాంటీన్లకు, కార్యాలయాలకు పసుపు రంగు ఎలా వేస్తారని ప్రశ్నించారు. పగలు, ప్రతీకారాలు పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శ్వేతారెడ్డి, డీఏఏబీ మాజీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎ.హనుమంతురెడ్డి, నాయకులు రంగప్ప, శ్రీనివాసులు యాదవ్, తిరుపాల్, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న హాఫీజ్‌ఖాన్, సిట్రా సత్యనారాయణమ్మ, తదితరులు

దోషులను కఠినంగా శిక్షించాలి

- మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సి.సత్యనారాయణమ్మ
- అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన

కర్నూలు (టౌన్): విజయవాడ నగర నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించిన దుండగులను కఠినంగా శిక్షించాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహ ధ్వంసాన్ని నిరసిస్తూ శనివారం రాత్రి పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వైస్సార్‌సీపీ నేతలు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అమలవుతుందా.. అని ప్రశ్నించారు. రాజ్యాంగ నిర్మాతను అవమానించడం సిగ్గుచేటన్నారు. అధికార పార్టీ నాయకులు సంక్షేమాన్ని గాలికొదిలి ప్రత్యర్థులపై దాడులు చేయడం, హత్య చేయడం లాంటి హింసాత్మక ఘటనలపైనే దృష్టి సారించినట్లున్నారని ఆరోపించారు. అరికట్టాల్సిన పోలీసు యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అంబేడ్కర్ విగ్రహం ధ్వంసానికి పాల్పడిన టీడీపీ మూకలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రామక్రిష్ణ, కేధార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కర్నూలు: కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివారు కాలనీకి చెందిన పదహారేళ్ల బాలిక అదృశ్యమయ్యింది. స్థానిక మదర్సాలో ఆల్ ఇన్ కోర్స్ చదువుతుండేది. ఈనెల 8న ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు జొహరాపురంతో పాటు కర్నూలు, చుట్టు పక్కల గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఒకటవ పట్టణ సీఐ పవన్‌కుమార్ తెలిపారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు

కర్నూలు సిటీ: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్ల పూర్తి కావడంతో శనివారం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో రవీంద్ర విద్యా సంస్థల వ్యవ స్థాపకులు జి.పుల్లయ్య, యూటీఎఫ్ రాష్ట్ర సహా ధ్యక్షులు కె.సురేష్‌కుమార్ హాజరై సంఘం జెండా ను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి కుమార్, నవీన్ పాటి, జిల్లా సహాధ్యక్షులు హేమంత్‌కుమార్, జిల్లా కార్యదర్శి తిమ్మన్న, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పల్లేటి కులశేఖర్ కన్నుమూత



కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్యంలో 62 పద్య నాటకాలు, 40 సాంఘిక నాటకాలు రచించిన ప్రముఖ రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్ కన్నుమూశారు. కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో ఆయన బాధ పడుతున్నారు. టీజీవీ కళాక్షేత్రం ఆస్థాన రచయితగా ఆయన రచించిన పద్య నాటకాలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ఇంత వరకు టీజీవీ కళాక్షేత్రానికి 38 నంది అవార్డులతో పాటు, ఎన్టీఆర్ అభినయ వెంకటేశ్వర, మిర్యాలగూడ సాంస్కృతిక కేంద్రం, తెనాలి వీణ అవార్డ్స్ రావడానికి ఆయన రచనలే కారణం. కులశేఖర్ మృతి పట్ల టీజీవీ కళాక్షేత్రం నిర్వాహకులు, కళాకారులు సంతాపం ప్రకటించారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో పల్లేటి కులశేఖర్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు.

నియామకం

కర్నూలు కల్చరల్: స్థానిక బీక్యాంప్ విజ్ఞాన మందిరం పరిపాలనాధికారులుగా ఉడుపి పేజావర మఠాధీశులు విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ అనుచరులు రవితేజ, మాధవ నియమితులయ్యారని మందిరం అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు విజ్ఞాన మందిరంలో భగవద్గీతపై ఉపన్యాసం ఉంటుందన్నారు.

మరణించాక కూడా జీవించొచ్చు

కర్నూలు(హాస్పిటల్): అవయందానంతో మరణించాక కూడా ఇతరుల్లో జీవించవచ్చని కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ తెలిపారు. ఈనెల 13న అంతర్జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని 15 రోజుల అవగాహన క్యాంపెయిన్‌లో భాగంగా శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అవయవ దానానికి ముందుకు వచ్చి మరొకరి ప్రాణాలను రక్షించాలని కోరారు. హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్, రెండవ పటాలపు అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ అన్నదానం సాటి మనిషి కడుపునింపితే అవయవదానం తోటి మనిషి ప్రాణాలు నిలబెడుతుందన్నారు. అవయవదానంపై పూర్తి స్థాయి అవగాహన ప్రజల్లో కలిగేలా స్వచ్ఛంద సంస్థలు చైతన్యం కలిగించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్, మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు క్రిష్టఫర్, మాధవ నాయుడు, శేఖర్, మద్దిలేటి పాల్గొన్నారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



ఆర్టీసీ-1 డిపోలో కొత్త బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

కర్నూలు సిటీ: ఎన్నికల హామీ మేరకు త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అములు చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా అన్నారు. శనివారం కర్నూలు–1 డిపో గ్యారేజీలో 4 కొత్త బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు, ఎమ్మిగనూరు నుంచి హైదరాబాదుకు, ఆదోని నుంచి కర్నూలు, కర్నూలు నుంచి శ్రీశైలానికి నూతన బస్సులను ప్రారంభించినట్లు చెప్పారు. వీటితో పాటు గత నెలలో 6 బస్సులతో కలిపి మొత్తం 10 కొత్త బస్సులను ప్రజా అవసరాల నిమిత్తం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, కర్నూలు–1 డిపో మేనేజర్ సుధారాణి, కర్నూలు–2 డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.